

# మంచినీళ్ళోయ్ !
# మల్లెపూలోయ్ !

అబ్బా! ఇదేం వూరురా దేవుడా! నాకస్సలు తోచట్లేదు. నాన్ననీ వూరెందుకేశారో భగవంతుడా! హాయిగా పరీక్షలయిపోయాక జామచెట్ల మీద మనసు తీరా వూయ్యాలూగొచ్చు కదాని మేం సంబరపడుతుంటే పిన్ని పెళ్లని చెప్పి కొవ్వూరేసుకు పోయారు. చేయగలిగిందే వుందిలే అన్చెప్పి ఆ వున్న వాళ్లతోనే సావాసం పట్టి ఆడుకోడం

మొదలెట్టేటప్పటికి ట్రాన్స్ఫరయి పోయిందని చెప్పి ఇదిగో ఈ వేడివేడూళ్లో పడేశారు. పోనీ బడికెడదామంటే ఇంకా నెల్లాళ్ల వరకూ ఆ బడి తెరవనే తెరవరుట.

నాకయితే ఈ ఇల్లెంత విచిత్రంగా అనిపిస్తోందో ! ఏలూర్లో సువర్ణ వాళ్లింట్లో ఎక్కడ పడితే అక్కడ పువ్వులూ, నీళ్లూ, మట్టీ, ఆకులూ వుండేవి కదా ! అంతా నీడనీడగా బురద బురదగా చల్లచల్లగా వుండేది కదా ! ఇక్కడ ఈ ఇంట్లో అంతా గచ్చే ! పెద్దపెద్ద బండలూ చిన్న చిన్న బండలూను. గిన్నెలు తోవుకోడానికి మట్టి కావాలన్నా ఎక్కడికో వెళ్లి వెతుక్కోవాలి. ఇదేం బెజవాడ ఫాషనో మరి. అదే ముక్క ధైర్యం తెచ్చుకుని ఇల్లుగల అత్తయ్యగారిని అడిగాను, ఓ వారం రోజుల తర్వాత ఆవిడ కన్పిస్తేను.

''ఇలా పెరడంతా గచ్చు చేయిస్తే ఎలా అత్తయ్యగారూ ? చెప్పు లేసుకోకుండా కాళ్లు బయట పెట్టలేక పోతున్నాం'' అని. ఆవిడ మంచావిడే కాబోలు. ఏవీ చెడ్డగా అనుకోకుండా ''కాదమ్మా ! మరి మట్టి మట్టిగా వుంటే ఎండ తెలియకుండా ఆడతారు గదా ! అందుకని అలా చేయించాం'' అన్చెప్పి నన్ను మొట్టమొదటిసారి అదీ మేం వచ్చిన వారం రోజులకి లోపలికి తీసికెళ్ళారు.

వాళ్ల హాలెంత పెద్దదో ! నేల మీద పక్కలేసుకుంటే వందమంది పడుకోవచ్చు. పెద్ద వుయ్యాల బల్ల. వూరికే పేరు కోసం పెట్టుకున్నది కాదు. ఎంతెంత వూపులన్నా వూగచ్చు. అంత జాగా వుంది. గోడలనిండా పెద్ద పొడుగాటి ఫోటోలు. ఎప్పటెప్పటి వాళ్లవో ! అందరాడ వాళ్ల మెళ్లల్లోనూ రింగులున్నాయి. వాటిని కంటెలంటార్ట. వాళ్లెవరంటే వాళ్ల అత్తగారూ మావగారూ, మళ్లీ వాళ్ల అత్తగార్లూ మావగార్లూ అలాగన్నమాట. నాకయితే అందరూ ఓలానే కనిపించారు. ఆవిడ గుర్తుపెట్టుకోలేరని కాబోలు అన్ని ఫోటోల మీదా పేర్లు రాసున్నాయి. మావయ్యగారి గదిలో మంచం అయితే ఎక్కేందుకు కుర్చీపీట కూడా వుంది. అన్నీ బీరువాలూ పెద్ద ఇనప్పెట్టె. చల్లటి గాలొచ్చే మిషను. అసలెంత చల్లగాలంటే ఎంత వేసం కాలం అయినా వణక్క తప్పదు. మావయ్యగారది మద్రాసు నించి తెప్పించార్ట. డబ్బెక్కువయితే అంతే కదా మరి! నాకసలు డబ్బున్న వాళ్లంటే ఎంత భయవో ! కాని మా దురదృష్టం ! ఒకళ్లకన్నా ఒకళ్లు డబ్బున్న వాళ్లిళ్లల్లో వుండాల్సొస్తోంది. ఏంచేస్తాం! కొన్ని తప్పించుకోలేం కదా ! అత్తయ్యగారిచ్చిన బఠానీలు మరమరాలూ పుచ్చుకుని ఇంట్లోకొచ్చి అమ్మకన్నీ పూస గుచ్చినట్లు చెప్పా! మరి అమ్మ అన్నీ విందో లేపోతే వినీ పట్టించుకోలేదో కనీసం వూ అని కూడా అనలేదు. మనకెప్పుడూ వున్నదేగా !

ఇంతలోకీ మాంచి మల్లెపూలూ మరువం వాసనా గుప్పుమంది. గుమ్మంలో ఒకతను మల్లెపూల బుట్టెచ్చుకుని నిలబడున్నాడు. ''సావిత్రమ్మగారంపిచ్చారండి. నెలవాడికెట్టు

కోండి. రోజూ ఇదే టయానికొచ్చిచ్చేల్తాను'' అని పువ్వులన్నీ చేత్తో అటూ ఇటూ పోస్తూ నిలబడ్డాడు. ఏ కళ నుందో అమ్మ వెంఠనే సరేనంది. రోజూ అయిదు వందల పూలు కావాలని చెప్పింది. కొత్తిమీరా కరివేపాకూ ఫ్రీయే గదా! (అంటే కొంచెం మరువం, కనకంబారాలూ నన్నమాట) ఇక్కడ జడల్లెఖ్ఖ కాదు. తలల్లెఖ్ఖే. లేపోతే నాకెంత అన్యాయం? చిన్నారిలాటి వాళ్లు నాలుగు జడలు కూడా వేసుకోగలరు. ఆ పువ్వులబ్బాయి లాభం ఒకటి రెండూ అంటూ వంద చేతులూ లెఖ్ఖపెట్టేవరకూ నలుగురం వెయ్యి కళ్లతో చూశాం. లేపోతే ఏమార్చేయడూ! అయిదువందల పూలంటే మాటలా! పువ్వులు కట్టవే అమ్మా అని పళ్లెం దారం బంతీ ముందు పెడితే సాయంత్రం లోపల కడతాలేవే అని పుస్తకవోటి పుచ్చుకూర్చుంది. ఇంక మన లోకంలోకి తేవడం కష్టం.

''అమ్మా! నీకెలాగూ ఈ పుస్తకం సాయంత్రం లోపల పూర్తిచేయాల్సిన పనుంది కదా! నాకో వుపాయం తోచింది చెప్పనా'' అనడిగా.

''ఏవిటి తల్లీ అంతోటుపాయం ? వంక లేనమ్మ డొంకట్టుకేడ్చిందని ఏదో ఓ పని పెట్టుకుని ఎండలో వూరేగడానికేగా''

''అబ్బా ఎందుకమ్మా! అట్లా నన్ను చీపురు పుల్లని చేస్తావు ? నేనేమో ఎప్పుడూ నీకు ఎలా పని సాయం చేసి పెట్టాలా అని ఆలోచిస్తుంటే నువ్వర్థం చేసుకోవు. ఇప్పుడు ఇవి సావిత్రొదిన దగ్గిర కట్టికెళ్లి కట్టించుకొచ్చాననుకో! నాకు పూలు కట్టడవూ వస్తుంది. నీకు ఓ పనయినా తప్పుతుంది!''

''అంటే అక్కడికెళ్లి మా అమ్మకి పూలు కట్టడవన్నా రాదని ఓ ఏడుపేడుద్దామనేనా?''

''ఆ సంగతి నే పనికట్టుకునేం చెప్పక్కర్లా! మొన్న సాయంత్రం మా తల్లో పూలు చూసి వదినెంత నవ్విందో! నా దగ్గిరికి పూలు తేవే నీకు కట్టడం నేర్పిస్తానంది కూడానూ - అమ్మా! ప్లీజ్! అమ్మా వెళ్లనివ్వవా ?'' మళ్లీ పుస్తకంలో పడిపోయినట్లుంది. ఏవీ పలకలేదు. ఒక్క కుదుపు కుదిపా !

మళ్లీ మొదలుపెట్టా ''అమ్మా! వదినకి ఎంత బాగా పువ్వులు కట్టడం వచ్చోనే! నువ్వేమో మొగ్గలో మొగ్గపెట్టి ముసలాళ్లు బిగ్గా జడేస్తారు చూడు అలా కడతావు. ఎన్ని పూలు కొన్నా నీ కట్టడం పుణ్యమాని దండలు పిక్కంతే వస్తాయి. నేను తన దగ్గిర నేర్చుకుని పూలు కడితే పెద్ద పెద్ద దండలల్లే కనిపిస్తాయి. మనందరికీ కలిపి వందపూలు తగ్గించుకోవచ్చు కూడాను - బోల్డు లాభం!''

అప్పటికి తలెత్తింది అమ్మ 'వెంటనే దయచెయ్యి తల్లీ నీ దండకం ఆపి! ఇంకాసేపుంటే నాకు పిచ్చెక్కించేస్తావు! ఒక్కసారి తలుపు తట్టే ముందు కిటికీలోంచి చూడు. మెలకువగా

ఉంటేనే తలుపు కొట్టు. పడుకునుంటే చప్పుడు చెయ్యకుండా వచ్చెయ్. ఇంతోటి పూలు కట్టడం ఆనక నేర్చుకోవచ్చు!''

బతుకుజీవుడా అనుకుని బయటపడ్డా మల్లెమొగ్గలన్నీ ఓ తడి రుమాల్లో చుట్టి ఓ గిన్నెలో పెట్టుకుని. అసలు మల్లిజాజీ, మొగ్గలుగా వుండగానే కట్టాలిట! విచ్చితే దండ సరిగ్గా రాదు. అదీకాక విచ్చిపోయాక కడితే చేతివేడికి పూలు సొమ్మసిల్లి పోతాయిట. ఇవన్నీ పాపం సావిత్రొదినే నాకు చెప్పింది. అమ్మకేమో మంచి మంచి టిఫిన్లు చేయడం పుస్తకాలు చదువుకోడం ఇష్టం. మరి సావిత్రొదినకయితే వంట చేయడం అంత నచ్చదనుకుంటా ! చీరలకి ఎంబ్రాయిడరీలు కుట్టడం, ముగ్గులు పెట్టడం, పువ్వుల దండలు కట్టడం చక్కగా రకరకాల క్రీములూ పౌడర్లూ (నాకు చేతిలో బోల్డు పౌడరేసేది పాపం) రాసుకుని మంచిగా ముస్తాబవడం (వాళ్ల వూరు ముస్తాబాదా కదా అందుకని) నాలాటి పనిలేని వాళ్లని పోగేసి కబుర్లు చెప్పడం ఇష్టంట. వదినేమో చిటికెడు ప్రశ్నకి గంటసేపు సమాధానం చెప్తుంది. అమ్మేమో నే గంటసేపు అడిగితే వూ అనో వువ్వూ అనో అంటుంది. అసలు వాళ్లిద్దరికీ ఇంత సావాసం ఎలా అయిందో నాకు తల్చు కుంటేనే ఆశ్చర్యమనిపిస్తుంది. మనలాటి వాళ్లం పుల్లలెడదామన్నా కుదరదు.

నేవెళ్లేటప్పటికి అమ్మ వూహించినట్లు తనేం నిద్దర పోవట్లా! వంటిల్లు సర్దుకుంటోంది. నన్ను చూడగానే ''పూలవాడొచ్చాడ్టే! ఎన్ని తీసుకుంటావన్నారు ? మాంఛి పొడుగు మొగ్గలు తెస్తాడు'' అనడుగుతూ నా గిన్నెకేసి చూసింది. పాఠం మొదలెట్టింది.

''అంతా కట్టడంలో వుందే ! చేతులు కాస్సేపు చన్నీళ్లలో వుంచు ముందు. దొడ్డు దారంతో కట్టాలి. కాస్త దారం కూడా నీళ్లలో పడేసుంచు. ఇదిగో ఈ మొగ్గుందా ! ఎడం చేత్తో రెండు వేళ్లతో ఒకటి పైకి పట్టుకోవాలి. అరిచెయ్యి తగలనియ్యకు. ఇంకో మొగ్గ దాని కింద పెట్టు. రెండు ఎడం ఎడంగా పెడితే దండ వెడల్పుగా వస్తుంది. ఇప్పుడు కుడిచేత్తో దారం ఇలా చుట్టి, ఇలా మెలికేసి నెమ్మదిగా లాగాలి అంతే ! అయిదుసార్లు పది మల్లెమొగ్గ లయ్యాక ఒకసారి మరువం, మళ్లీ ఇంకో పదిమొగ్గలయ్యాక కనకాంబరాలు పెట్టాలి అంతే!''

ఒకటి రెండు రోజులు పసిరి మొగ్గలతో ప్రాక్టీసు చేశా. చక్కగా కట్టడం వచ్చేసింది. నాతో బాటే చిన్నారీ ప్రయత్నం చేసింది కానీ పాపం ఎందుకో మరి దానికి చాతకాలా ! కాలిమాల కట్టడం మాత్రం వచ్చింది. నాకు కట్టడం వచ్చేసిందని ఈసారి అమ్మ నిజంగానే చాలా సంబరపడిపోయింది. ''పోనీలే ఆ సావిత్రమ్మ పుణ్యామా అని నాకో పని తప్పింది. నీకు కాస్త తిరగడం తగ్గుతుంది. కానీ ఎవరివి వాళ్లకి ఎంచుతూ లెఖ్ఖగా కట్టు సుమా ! తేడా వస్తే నీ ప్రాణాలు తోడేస్తారు'' అని హెచ్చరిస్తూనే మొత్తం పెత్తనం నాకిచ్చేసింది. ఇంక చిన్నారి

చచ్చినట్లు నా మాట వింటుందని ఆశపడ్డా. అబ్బే ! నాకంత అదృష్టమా ! అది ఎంత పిచ్చిగా అయినా అమ్మచేతే కట్టించుకుంటుందిట. లేకపోతే కాలి మాలయినా ఫరవాలేదుట గానీ నామీదాధారపడే ప్రశ్నే లేదని ఖచ్చితంగా చెప్పింది.

మేం ఒంటిగంటన్నాలు తినేటయానికే వాడు పువ్వులు తెచ్చేస్తాడు. అన్నీ జాగర్తగా కంచంలో పోసి రెండు గ్లాసుల నీళ్లుపోసి పక్కన పెట్టడం. ముందు వందా అమ్మకోసం కట్టి అద్దబ్బల్ల దగ్గిరపెట్టడం. మరి తరవాతపెద్దదాన్ని నేనే కదా. అంతా పెద్ద చిన్నల ప్రకారం రావాలి కదా ! మనం పని కట్టుకు ఏరి కట్టక పోయినా చేతులకలా చేయమని నేర్పెట్టక పోయినా వేళ్ళెప్పుడూ పళ్లెంలో వున్న పెద్ద మొగ్గల మీదకే వెడతాయి కదా ! అదేవన్నా నే కావాలని చేసే పనా! కట్టగా కట్టగా చివరాఖరికి చిన్న మొగ్గలూ, చిట్ట చివరి వాళ్లకి పసిరి మొగ్గలే కదా మరి. ఎలాగైనా తేడా తెలిసిపోతుంది మరి ! తన దండ చూసుకుని బుజ్జి వూరంత గొంతుపెట్టుకుని ఒకటే ఏడుపు. ఇందూ బుజ్జీ కలిసి నాతో యుద్ధం. ఓరోజు ముందు పెద్దల దగ్గిర్నుంచి చిన్నల దగ్గిరకొస్తే ఆ మర్నాడు చిన్నల దగ్గిర్నుంచిపెద్దల దగ్గిరకెళ్లాలని. అబ్బా! ఆశ! నాకే ఎసరుపెడితే నేనెందుకూరు కుంటానూ ! ''కావాలంటే ముందు పుట్టకపోయారా ? ముందు పుట్టి మీ అందరి బదులూ తిట్లు తినలేక ఛస్తున్నాన''ని చెప్పి వాళ్ల నోళ్లు మూయించేశాను.

కానీ అన్ని రోజులూ మనవి కాదని అమ్మ వూరికే అనదుగా ! ఓ రోజు ఇందూ, బుజ్జీ పూలవాడు రాగానే వంటింట్లో కెళ్లి అయిదు గ్లాసులు పట్టుకొచ్చి అన్నిట్లో తలా వందా ఎంచింపించి నీళ్లు పోసి నాకు పట్టుకొచ్చిచ్చారు. అమ్మ దండ కట్టేసి చిన్నారి గ్లాసు దానికిచ్చేశా! ఇంక వీళ్లిద్దరూ చెరో గ్లాసుతో నిలబడ్డారు చవట మొఖాలేసుకుని.

''తల్లులారా ! తియ్యండి తియ్యండి. చెరో పదిపూలూ నా గ్లాసులో వెయ్యండి. మీపాటి బోడి తెలివి తేటల్లేని వాడెవడూ లేడిక్కడ. ఎలా కనిపిస్తున్నా మీకు ? వూరికే చాకిరీ చేయించుకుని ఇకిలిద్దావనే ! ఫీజిస్తేనే పూలు కట్టేది. పోన్లే పాపం అని నే జాలి పడితే మీరు నాకే పాఠాలు చెప్తారా ?'' దెబ్బకి నోరు మూసుకుని నాకు చెరో పది పూలూ సమర్పించుకుని వాళ్ల దండలుచ్చుకుని పోయారు పాపం.

ఆవేళ రాత్రి నాన్న ఆఫీసు నించి రాగానే మంచి నీళ్లిస్తే ''ఛీ ! వెధవ కంపు ! ఎవరు నీళ్లల్లో మల్లెపూలేశారు ?'' అని కేకలు ! నెమ్మదిగా చెప్పా! ''నీళ్లల్లో పువ్వులెయ్యలేదు నాన్నా ! పువ్వుల గ్లాసులోనే నీళ్లు తాగాలికనించీ మనందరం'' అని.